ప్రజాశక్తి

గురువారం 5 సెప్టెంబర్ 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం

గంజాయి రహిత జిల్లాయే లక్ష్యం

విజయనగరం కలెక్టర్ అంబేద్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

గంజాయి ఉత్పతిని, రవాణాను, వినియోగాన్ని అరికట్టి గంజాయి రహిత జిల్లాగా విజయ నగరాన్ని నిలిపేందుకు పోలీస్, ఇతర శాఖలు సమన్వయం తో పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు వేసి డ్రగ్స్ వినియోగం వలన జరిగే నష్టాల గురించి అవగాహన కలిగించాలని తెలిపారు. బస్టాండ్ లో, రైల్వే స్టేషన్లలో, ముఖ్య కూడళ్లలో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కూడా అవ గాహన కలిగించాలని తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధక జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణాను అరికట్టడానికి ప్రధానంగా రాయగడ, కోరాపుట్, ఎఎస్ఆర్ జిల్లాల రూట్లలో తిరిగే ఆర్‌టిసి డ్రైవర్లకు, కండక్టర్లకు గట్టి నిఘా ఉండేలా చూడాలని తెలిపారు. వ్యవ సాయ, ఉద్యాన, అటవీ శాఖల అధికారులు గంజాయి పంట ఎక్కడైనా వేస్తున్నారేమోనని కన్నేసి ఉంచాలన్నారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలూ సమన్వయంతో జాయింట్ తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది ఇంతవరకు 49 కేసులను (మిగతా..3లో)

ఉత్తమ ఉపాధ్యాయులుగా
75 మంది ఎంపిక

నేడు కలెక్టరేట్‌లో అవార్డులు ప్రదానోత్సవం

5లో



పార్వతీపురం డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలని
సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో పట్టణాలతోపాటు గ్రామాల్లో జ్వరాలతో మరణాలు సంభవిస్తున్నాయని, ప్రభుత్వ వైద్య సౌకర్యాన్ని మెరుగుపరచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్మోహనరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని పట్టణాల్లోని వార్డుల్లో, గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. జిల్లా కేంద్రంలో, సిహెచ్‌సిలో రోగుల తాకిడి అధికంగా ఉందని, ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు పేషెంట్లు ఉండటంతో వ్యాధుల తీవ్రత పెరుగుతుందని, ప్రభుత్వం అదనపు బెడ్లు, సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. 15 మండలాల్లోని పిహెచ్‌సిల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాల న్నారు. నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పార్వతీపురంలో ప్రభుత్వం మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్వతీపురంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేపట్టాల న్నారు. గిరిజన ఆశ్రమ (మిగతా..3లో)

సిపిఎం ఆధ్వర్యంలో సహాయనిధి వసూళ్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల కలిగిన వరద ప్రమాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ముంపు ప్రాంతాల బాధితులను ఆదుకోవాలని, అన్నివిధాలా, సహాయ సహకారాలు అందించాలని కోరారు. మానవతా దృక్పథంతో ప్రజలు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యాన వరద బాధితులకు సహాయ నిధి వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సిపిఎం కార్యకర్తలు రాత్రి. పగలు శ్రమించి వరద బాధితులకు ప్రత్యక్షంగా సహాయ సహకారాలు అందజేస్తున్నారన్నారు. భోజనం, నీరు, పాలు, కనీస అవసరాలు తీర్చడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. విజయవాడ వరద బాధితులకు ఆర్థికంగా సహకరించి




విజయనగరం : విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్ మోహన్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.రమణ, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్. ఆనంద్, ఐద్వా నగర కార్యదర్శి వి.లక్ష్మి తది తరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: విజయవాడ వరద బాధితుల కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని విరాళాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా షాపు షాపుకు వెళ్లి రూ. 4,562 లు సేకరించామని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులను మానవతా దృక్పథంతో విరివిగా విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు చెలికాని ముత్యాలు, కే రమేష్, అను తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : విజయవాడలో వరద భారిన పడిన కుటుంబాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సిఐటియు నాయకులు టివి రమణ డిమాండ్ చేశారు. వరద బాధితుల సహాయార్థం బుధవారం పట్టణంలో విరాళాలు సేకరించారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రూ. 5,350 విరాళాలను అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి అంబాల గౌరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాంలో విజయవాడ వరద


గరివిడి: విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

బాధితులు కోసం సిపిఎం నాయకులు బుధవారం విరాళాలు సేకరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, గాడి అప్పారావు, చలుమూరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.40వేలు విరాళం

బొబ్బిలి: వరద బాధితులకు మాజీ సైనిక ఉద్యోగులు సేకరించిన రూ.40వేలు విరాలన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ఖాతాకు జమ చేశారు. వరద బాధితులకు అండగా ఉండేందుకు మాజీ సైనికులు ప్రజల నుంచి రూ.20వేలు, ఎమ్మెల్యే బేబినాయన ఇచ్చిన మరో రూ.20వేలును కలిపి బుధవారం సీఎం సహాయ నిధికి జమ చేసినట్లు మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్ చెప్పారు. విరాళాలు ఇచ్చిన ఎమ్మెల్యే బేబినాయన, ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు.

క్వారీతో ప్రయోజనం ఉండాలి

ప్రజాభిప్రాయ సేకరణ సభలో కోరిన గిరిజనులు

ప్రజాశక్తి - వేపాడ

క్వారీల ఏర్పాటుతో గిరిజనులకు ప్రయోజనం ఉండాలని ప్రజాభిప్రాయ సేకరణలో గిరిజనులు అధికారులకు వినతి పత్రాలను అందించారు. బుధవారం మండలంలోని దుంగాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 7లో రెండు హెక్టార్లలో క్వారీ ఏర్పాటునకు అనుమతి కావాలని ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా రెవెన్యూ అధికారి అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నాయకులు పరిసర ప్రాంతాల పెద్దలు మాట్లాడుతూ ప్రయోజనాలు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. వావిలపాడు గ్రామ పెద్ద బీల సతీష్ మాట్లాడుతూ క్వారీకి తమ గ్రామ పంచాయతీ ఆమోదం కావాలి కానీ ఆదాయం మాత్రం వీలుపర్తి పంచాయతీకి దక్కుతుందన్నారు. దీని వల్ల తమ పంచాయతీకి నష్టం కలుగుతుందని అధికారులకు వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణలో హామీలిచ్చినా భవిష్యత్తులో వాటిని అమలు చేయడం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాంత ప్రజలకు రహదారి, తాగునీటి, వైద్య సౌకర్యం కల్పించకుండా గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ముఖ్యంగా క్వారీల ద్వారా పరిమితికి మించిన బరువుతో లారీలు ప్రయాణించడం వల్ల రోడ్లు పాడైపోతున్నాయని నిబంధనలు మేరకు క్వారీలు నడుపుకొని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని గిరిజనులు కోరారు. ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా మైనింగ్ అధికారుల హాజరు కాకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు చర్చించుకున్నారు. ఈ సమావేశంలో పొల్యూషన్ ఈఈ, మండల రెవెన్యూ అధికారి సన్యాసినాయుడు, గిరిజన గ్రామాల నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

సెంటుకు రూ.30వేలకు మించి ఇవ్వలేం

రైతులకు తేల్చి చెప్పిన ఆర్‌డిఒ సూర్యకళ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని విమానాశ్రయం తాగునీటి పైపు లైన్లకు సంబంధించిన భూములకు పరిహారం సెంటకు రూ.30వేలు కంటే పెంచేది లేదని ఆర్‌డిఒ సూర్యకళ రైతులకు తేల్చి చెప్పారు. దీంతో ఆ రేటుకు భూములు ఇచ్చేందుకు రైతులు ఆలోచనలో పడ్డారు. విమానాశ్రయ నిర్మాణానికి తాగునీటి పైప్ లైను వేసేందుకు 33 సెంట్లు నందిగామ రెవెన్యూలో గుర్తించిన విషయం తెలిసిందే. ఈ భూములను బుధవారం ఆర్‌డిఒ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సెంటుకు రూ.20వేలు పరిహారం ప్రకటించారని కానీ అదనంగా మరో రూ.10వేలు పెంచి సెంటుకు రూ.30వేలు ఇస్తామని చెప్పారు. రైతులను దృష్టిలో పెట్టుకుని పరిహారాన్ని పెంచాలని రైతులతో పాటు నాయకులు గరే వెంకటరమణ, సర్పంచ్ గరే మురళి ఆర్‌డిఒను కోరారు. కానీ ఇంతకన్నా పెంచేది లేదని ఆమె చెప్పారు. రెండు మూడు రోజుల్లో దీనికి సంబంధించిన పరిహారాన్ని కూడా అందజేస్తామని తెలిపారు. ఈ భూములపై మరోసారి సర్వే చేసి పనులు ప్రారంభించాలని తహాశీల్దార్‌కు ఆమె ఆదేశించారు. కోట భోగాపురం రెవెన్యూ పరిధిలో సేకరించిన భూమిని తప్పించి నందిగామ రెవన్యూలో సేకరించాలని తెలిపారు.

ఆర్‌టిసి బస్సు ట్రయిల్ రన్

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలకు ఆర్‌టిసి బడి బస్సును నడపడానికి బుధవారం అధికారులు ట్రయిల్ రన్ వేశారు. ఎస్. కోట ఆర్‌టిసి డిపో నుంచి బడి బస్సును నడపాలని మంత్రి నారా లోకేష్‌కు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు దరఖాస్తు చేసిన నేపథ్యంలో ఆయన ఆదేశాలతో అధికారులు ట్రయిల్ రన్ వేశారు. జాకేరు మీదుగా కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామాల పిల్లలను ఆదర్శ పాఠశాలలకు తీసుకెళ్లేందుకు బస్సు నడపాలని కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఆర్‌టిసి డిపిటిఒ సిహెచ్ కృష్ణారావు దగ్గరుండి ట్రయిల్ రన్ వేశారు. ఈ పరిశీలనలో రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు, తుప్పలు, విద్యుత్ స్తంభాలు, బస్సు రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నందున ప్రస్తుతానికి బస్సు నడపలేమని తెలిపారు. గతంలో కూడా ట్రయిల్ రన్ వేసినపుడు జాకేరు సర్పంచ్, గ్రామ పెద్ద అప్పలనాయుడు కొంతవరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు, చెట్ల కొమ్ములు తొలగించారు. కరకవలస, చామలాపల్లి గ్రామ సర్పంచులు కనీసం స్పందించకపోవడంతో రోడ్డుకు ఇరువైపులు ఉన్న డొంకలు అలాగే ఉన్నాయి. దీంతో వీటిని తొలగించకుండా బస్సును నడపలేమని అధికారులు తేల్చి చేప్పేశారు. తుప్పలు, డొంకలు తొలగిస్తే బస్సును నడపడానికి తమకు ఎటువంటి అభ్యంతరమూ లేదన్నారు. ఈ పరిశీలనలో ఎస్‌కోట ఆర్‌టిసి డిపో మేనేజర్ రమేష్, ఇన్చార్జి మేనేజర్, సెక్యూరిటీ తదితరులు పాల్గొన్నారు.


రూట్ ను పరిశీలిస్తున్న ఆర్‌టిసి అధికారులు

పశువుల ఆస్పత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని నెమలాంలో ఉన్న పశువుల ఆసుపత్రి శిథిలావస్థలో ఉందని గ్రామ పెద్దలు, అక్కడ వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన బుధ వారం ఆస్పత్రిని పరిశీలించారు. వెంటనే పిఆర్ ఎఇకి ఫోన్ శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పరిశీలించి నూతన భవనం నిర్మాణానికి ప్రతిపా దనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం అదే గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వేమిరెడ్డి అప్పలనాయుడు మాస్టర్ రిటైర్మెంట్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమిటి గ్రామానికి చెందిన కరణం రమేష్ నాయుడు తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని పరామర్శించారు. ఉద్దవోలు గ్రామంలో ఎంపిటిసి మరడాన చిన్నమ్మనీ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నర్సుపల్లి వెంకటనాయుడు, నర్సుపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వితంతు పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ పింఛను పొందుతూ చనిపోయిన భర్త స్థానంలో వితంతు మహిళలకు పింఛన్లు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో భర్త స్థానంలో పింఛను మంజూరు చేయాలని ఎంతోమంది వితంతు మహిళలు దరఖాస్తులు చేసుకున్నారని వారికి ఇంతవరకు మంజూరు చేయకపోవడం దారుణమని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా భర్త స్థానంలో వితంతు పింఛన్లు మంజూరు చేయక పోవడం అన్యాయమన్నారు. భర్త ఉన్నప్పుడు పింఛన్ పొందిన ఆయా కుటుంబాలు భర్త చనిపోయిన తర్వాత పింఛను రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం వితంతు పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని లేని పక్షంలో వితంతు మహిళలతో ఆందోళన చేస్తామని రామారావు హెచ్చరించారు.

పాఠశాలను రెన్యువల్ చేయండి

బొబ్బిలి: సిబిఎం బాలికోన్నత పాఠశాలను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ కరస్పాండెంట్ రత్నకుమార్‌ను ఎస్‌ఎఫ్ఐ నాయకులు మణికుమార్, శివ, విద్యార్థులు ఘెరావ్ చేశారు. సిబిఎం పాఠశాలను మూసి వేసేందుకు కరస్పాండెంట్ రత్నకుమార్ కుట్ర పన్నుతున్నట్లు ఆరోపణలు వస్తుండటంతో ఆయన బుధవారం పాఠశాలకు వచ్చిన విషయాన్ని తెలుసుకుని ఎల్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కరస్పాండెంట్‌ను ఘెరావ్ చేసి అడ్డుకున్నారు. పాఠశాల రెన్యూవల్ చేసే వరకు కదిలేది లేదని హెచ్చరించడంతో మూడు రెన్యూవల్ ఫారాలపై రత్న కుమార్ సంతకం చేశారు. దీంతో ఆందోళన విరమించారు.

సాగర్ కవచ్‌ను పరిశీలించిన ఎఎస్‌పి

భోగాపురం: తీర ప్రాంతంలో జరుగుతున్న సాగర్ కవచ్ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం కోస్టల్ సెక్యూరిటీ అడిషనల్ ఎస్‌పి బిపిఆర్ మధుసూదనరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ముక్కాం కూడలి వద్ద తీర ప్రాంత గ్రామాల నుంచి రాకపోకలు చేస్తున్న వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ రెండు రోజుల పాటు తీర ప్రాంత గ్రామాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. సముద్ర తీరం నుంచి చొరబాటు దారులు వస్తే వారిని ఏ విధంగా పట్టుకునలనే దానిపై మాక్ డ్రిల్ కార్యక్రమంలో భాగంగా ఈ సాగర్ కవాచ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మెరైన్ సీఐ వైకుంఠరావు, ఎస్ఐ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు

నెల్లిమర్ల: మండలంలోని కొత్తపేటలో పాడి రైతులకు బుధవారం విజయనగరం నాబార్డు, గుర్ల డైరీ ఉత్పత్తి దార్ల ఎఫ్‌పిఒ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వైవి రమణ మాట్లాడుతూ నాబార్డు పాడి రైతుల అభివృద్ధికి సహకారం అందిస్తుందన్నారు. డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ కిసాన్ క్రెడిట్ కార్డులు పశుసంవర్ధక శాఖ అధికారులు ద్వారా దరఖాస్తు చేసుకుని అర్హతను బట్టి ఋణాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ శ్రీను, మాజీ సర్పంచ్ గురాన అసిరి నాయుడు, నాబార్డు ఎజిఎం నాగార్జున, ఎడిఎ జి. చక్రవర్తి, పశువైద్యులు డాక్టర్ చంద్రశేఖర్‌నాయుడు, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఎఫ్‌పిఒ సిఇఒ గణేష్ వర్మ రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పోలీసుల సాయం

డెంకాడ: చింతలవలస 5వ బెటాలియన్‌కు చెందిన పోలీస్ సిబ్బంది విజయవాడ వరదల్లో చిక్కుకున్న వారికి సేవలు అందిస్తున్నారు. ఈ బెటాలియన్ నుంచి 95 మంది సిబ్బంది మరో ఏడుగురు డ్రైవర్లు విజయవాడ వెళ్లి అక్కడ అపార్టుమెంట్లలో ఉన్నవారిని రక్షించి బయటికి తీసుకువచ్చి పునరావాస కేంద్రాలకు తరలించారు. వీరు చేస్తున్న సేవలను పలువురు ఉన్నతాధికారులు కొనియాడారు.

మార్కెట్‌లోకి టివిఎస్ జూపిటర్

బొబ్బిలి: టివిఎస్ జూపిటర్ 113 సిసి స్కూటీను మార్కెట్లోకి విడుదల చేశారు. పట్టణంలోని గాయత్రి మోటార్స్‌లో బుధవారం నూతన స్కూటీను ఎఎంసి మాజీ చైర్మన్, న్యాయ వాది పువ్వల శ్రీనివాసరావు విడుదల చేశారు. టివిఎస్ జూపిటర్ 113 సిసి స్కూటీ అత్యాధునిక టెక్నాలజీతో మార్కెట్లోకి విడుదలైనట్లు శ్రీనివాసరావు చెప్పారు. షోరూమ్ ఎమ్‌డి వారణాసి శ్రీహరి, డైరెక్టర్ అనురాధ మాట్లాడుతూ పెట్రోల్ ట్యాంకు ముందుకు వచ్చి డిక్కీ ప్లేస్ ఎక్కువ వస్తుందని, ఎల్‌ఇడి డిస్ ప్లే, స్కూటీకు మొబైల్ కనెక్ట్ చేసుకోవచ్చునని చెప్పారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఫోన్ వస్తే ఎవరు ఫోన్ చేస్తున్నారో స్కూటీ డిస్‌ప్లేలో కనిపిస్తుందని చెప్పారు. లీటర్ పెట్రోల్ 50 కిలోమీటర్లకు పైగా మైలేజ్ వస్తుందన్నారు.

ప్రకృతి సాగు పరిశీలన

వేపాడ: మండలంలోని కే.జీ.పూడి పంచాయతీ పరిధిలో గల ప్రకృతి వ్యవసాయాన్ని జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ (డిపిఎం) ఆనందరావు బుధవారం పరిశీలించారు. పంటల పై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసి అధిక ఖర్చులను తగ్గించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పికెఆర్‌పురంలో దేశీ వరి లైన్ షోయింగ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఈశ్వర్, సబల్ కోఆర్డినేటర్ వీరభద్రస్వామి, సిఎస్‌సి సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్ రైతులు పాల్గొన్నారు.

కెంగువలో ఉచిత మెగా వైద్య శిబిరం

గజపతినగరం: గుడివాడ కార్తికేయ 3వ వర్థంతి సందర్భంగా కెంగువ గ్రామంలోని గుడివాడ కార్తికేయ స్మారక విజ్ఞాన కేంద్రం వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని కేంద్రం సభ్యులు గుడివాడ అచ్చంనాయుడు, విజయ అన్నారు. ఈ ఉచిత వైద్య మెగా శిబిరాన్ని 250 మందికి పైగా వినియోగించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

వరద బాధితులకు జిల్లా నుంచి సహాయం

రెండు లక్షల వాటర్ ప్యాకెట్లు పంపిన జిల్లా యంత్రాంగం ● వాహనాలను ప్రారంభించిన ఎంపి కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయవాడ వరద బాధితుల సహాయార్ధం జిల్లా నుంచి రెండు లక్షల వాటర్ ప్యాకెట్లతో కూడిన రెండు ట్రక్కులు బుధవారం జిల్లా కేంద్రం నుండి బయలుదేరాయి. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాల మేరకు జిల్లా తరపున గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈ రెండు ట్రక్కులతో వాటర్ ప్యాకెట్లను విజయవాడకు పంపించే ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ కార్యాలయం వద్ద రెండు ట్రక్కులతో సిద్ధంగా వున్న లారీలను పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్పి వకుల్ జిందాల్ బుధవారం



వాటర్ ప్యాకెట్ల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రారంభించారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచనల మేరకు విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఈ ప్యాకెట్లను అందిస్తామని గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్ఇ డి.ఉమాశంకర్ చెప్పారు. ఈ సందర్భంగా ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ విజయవాడలో ఎన్నడూలేని విధంగా వరదలు సంభవించాయని, అక్కడి వరద బాధితులను ఆదుకొనేందుకు ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సహాయం అందించాలని కోరారు. జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు వరద బాధితులకు రూ.10 లక్షలు సహాయంగా ప్రకటించారని, జిల్లాలోని అన్ని వర్గాల వారు తమ వంతుగా సహాయం అందించాలని కోరారు.

నగరపాలక సంస్థ లోగో తయారు చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మున్సిపల్ అసోసియేషన్‌గా 1888వ సంవత్సరంలో ఏర్పడి దినదినాభివృద్ధి చెందుతూ 2019 జూలై 2న విజయనగరం నగరపాలక సంస్థగా ఏర్పాటు అయ్యింది. సుమారు ఐదేళ్లుకావస్తున్నా అధికారిక చిహ్నం ఏదీ లేదు. ఈనేపథ్యంలో అధికారిక చిహ్నం ఏర్పాటు చేసుకోవలసిన ఆవశ్యకత ఉన్నందున విజయనగరం నగర ప్రాచీనతను, పురాణ ప్రసిద్ధతను, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే విధంగా ఒక అధికారిక చిహ్నం (లోగో) ను తయారు చేయాలని చిత్రకారులను నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో కోరారు. చిత్రకారులు తాము రూపొందించిన విజయనగరం నగరపాలక సంస్థ లోగోను 98499 06486 నెంబర్‌కు వాట్సప్ ద్వారా గాని, commvzm@yahoo.com అనే ఈమెయిల్ లో గాని ఈనెల 30లోగా పంపించాలని కోరారు. వచ్చిన లోగోలలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రజాభిప్రాయం కోసం వాట్సప్‌లో ఓటింగ్ నిర్వహించి మెజార్టీ ప్రజాభిప్రాయం మేరకు లోగోను కౌన్సిల్ వారి ముందుంచి, ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన లోగో రూపకర్తను ఆలోగో విడుదల సందర్భంగా దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించడంతో పాటు రూ.1,116 పారితోషకం ఇస్తామని తెలిపారు.

పారాది వంతెన వద్ద వాహనాల బారులు

బొబ్బిలి : పారాది వంతెన వద్ద భారీ వాహనాలు బారులు తీరాయి. పారాది వంతెన కుంగడంతో కాజ్‌వే నిర్మించారు. కాజ్ వే పై నుంచి వరదనీరు ప్రవహించడంతో భారీ వాహనాల రాకపోకలకు అనుమతించకుండా వాహనాలను దారి మళ్లించారు. ఈ విషయాన్ని పోలీసులు వాహన డ్రైవర్లకు చెప్పకపోవడంతో పారాది వైపు భారీ వాహనాలు వచ్చేస్తున్నాయి. దీంతో అనుమతి లేక రోడ్డుమీదే బారులు తీరాయి. అధికారులు స్పందించి భారీ వాహనాలను దారి మళ్లించాలని, నూతన వంతెన పనులు ప్రారంభించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

బొబ్బిలి : స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల కార్యాలయంలో గురువారం రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహధ్యక్షులు రౌతు రామమూర్తి తెలిపారు. సన్మానాలపై బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కర్రి సత్యనారాయణ, ఎల్.జగన్నాధం, సిహెచ్ శ్రీరాములు, వి.శ్రీరాములు, బి.సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

విడివికెల కార్యకలాపాలు పెరగాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

వన్‌ధన్ వికాస్ కేంద్రాల కార్యకలాపాలు పెరగాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో జీవనోపాధుల కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. విడివికెల ద్వారా జిల్లాలో లభ్యం అవుతున్న అన్ని పంటల కొనుగోలుతో పాటు పాడిపశువుల నిర్వహణ, దర్జీ పని, సివిల్ కాంట్రాక్ట్ పనులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ వంటి బహుముఖ పనులు చేపట్టవచ్చని ఆయన అన్నారు. ఖాతాల నిర్వహణలో మంచి శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాలో జీవనోపాధుల కార్యక్ర మాలు సంబంధిత విభాగాలు అన్ని సమన్వయంతో చేపట్టాల న్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటుకు త్వరగా చర్యలు చేపట్టాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎన్ మూర్తిని ఆదేశించారు. నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి డిఎస్ దినేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఫాం ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ల ద్వారా రెండు వేల మందికి జీవనోపాధులు కల్పించుటకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆశావహ బ్లాక్ కింద భామిని మండలంలో 200 మందికి జీవనోపాధులు కల్పించుటకు అవకాశాలు ఉన్నాయని వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ రామ చంద్రరావు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు సాయి కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి. కరుణాకర్, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, పిఎంయు నోడల్ అధికారి పి లక్ష్మీకాంత్, చేనేత జౌళి శాఖ ఎడిఒ రమణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు నవీన్ ఎంపిక

ప్రజాశక్తి- కొత్తవలస

స్థానిక వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న లాభాల నవీన్ కుమార్ జాతీయ స్థాయి లాక్రోజ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కర్నూలులో జరిగిన జాతీయస్థాయి లాక్రోజ్ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సి.హెచ్. ప్రవీణ్ కుమార్, ఈఎస్ కుమార్‌బాబు, ఎం. లక్ష్మణరావు కళాశాల అధ్యాపక బృందం విద్యార్థిని అభినందించారు.

మడ్డువలసకు తగ్గిన వరద ఉధృతి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని మడ్డువలస ప్రాజెక్టుకు సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి వచ్చే వరద ఉధృతి బుధవారం నాటికి తగ్గుముఖం పట్టింది. ఈ రెండు నదుల నుంచి 3,324 క్యూ సెక్కుల నీరు మాత్రమే రావడంతో మూడు గేట్లు ద్వారా 5,070 క్యూ సెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి లెవెల్ నీటిమట్టం 65 మీటర్లు కాగా ప్రస్తుతం 63.83 లెవెల్ నీటిమట్టం ఉందని ప్రాజెక్టు ఎఇ నితిన్ కుమార్ బుధవారం తెలిపారు.

వీధి కుక్కలను నివారించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వీధి కుక్కల నివారణకై పంచాయతీ ఇఒ అనురాధకు జనసేన పార్టీ తరపున నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌కోట పంచాయతీ పరిధిలో బర్మా కాలనీ, పుణ్యగిరి రోడ్డు, జగనన్న కాలనీ తదితర ప్రాంతాలలో వీధి కుక్కల తాకిడి ఎక్కువగా ఉందని వాటి కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి సురేష్ రాజు, తాండ్రంగి చంటి, మోపాడ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లాయే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నమోదు చేసి 1109 కేజీల గంజాయిని సీజ్ చేసామని, ఇందుకు సంబంధించి 140మంది ని అరెస్ట్ చేశామని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు లేదని, అయితే సరిహద్దు జిల్లాలైన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల నుండి రవాణా జరుగుతోందని తెలిపారు. జిల్లాలో డి- అడిక్షన్ కేంద్రం ఉన్నప్పటికీ పూర్తి స్థాయి లో పని చేయడం లేదని, వెంటనే దానిని పునరుద్ధరించాలని కలెక్టర్ ను కోరారు. జిజిహెచ్ లో 15 బెడ్ వార్డ్ ఉందని, అయితే సంబంధిత మెడికల్ ఆఫీసర్ 6 నెలల క్రితమే రిజైన్ చేసారని, ప్రస్తుతం ఆ పోస్ట్ ఖాళీగా ఉందని డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర రావు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే డి-అడిక్షన్ కేంద్రం పని చేయాలనీ, ఏమేం అవసరమో ప్రతిపాదించి ఫైల్ వెంటనే పెట్టాలని ఆదేశించారు. మందుల దుకాణాల్లో వైద్యుల చీటీ లేకుండా అమ్మే మందులపై డ్రగ్ కంట్రోల్ అధికారి దృష్టి పెట్టాలని తెలిపారు. విద్య సంస్థలలోనూ, పబ్లిక్ స్థలాల్లో ను అవగాహనా సదస్సులు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర రావు, ఉప రవాణా కమిషనర్ మణికుమార్ , ఆర్‌డిఒలు సూర్యకళ , శాంతి, సాయి శ్రీ, డిఎస్‌పిలు గోవింద రావు, శ్రీనివాసరావు, జిఎస్‌టి జాయింట్ కమిషనర్, డిపిఒ శ్రీధర్‌రాజ, జిల్లా వ్యవసాయ అధ్దికారి తారక రామా రావు, బాలల సంరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు హిమ బిందు , కళాశాలల ప్రిన్సిపాళ్లు , పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలని

సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలల్లో రెగ్యులర్ ఎఎన్‌ఎంలను నియమించాలని, విద్యార్థుల మరణాలు ఆపాలని కోరారు. వైద్యం అందక సంభవించినవి ప్రభుత్వ మరణాలేనని, వాటిపై దర్యాప్తు చేపట్టి బాధితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వెంకటరమణ, పి.సన్యాసిరావు, బి.సూరిబాబు, రెడ్డి శ్రీదేవి, బంటు దాసు, పి.రాము, వి.ఇందిర, వై.మన్మథరావు, కొల్లి సాంబమూర్తి, బి.వెంకటరమణ, రెడ్డి లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలు పరిష్కరించాలని సాలూరు ఏరియా ఆసుపత్రి వద్ద సిపిఎం ఆధ్వర్యాన బుధవారం నిరసన చేపట్టారు. సాలూరు సిహెచ్‌సిని ఏరియా ఆసుపత్రిగా ప్రకటించినా ఇంకా సౌకర్యాలు మాత్రం పూర్తిస్థాయిలో కల్పించలేదని చెప్పారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నప్రభకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వంతాల సుందరరావు, గేమ్మెల గాసి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని గుచ్చిమి-చినరాయుడిపేట గ్రామాల మధ్య మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకవ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఎం.రమేష్ కథనం ప్రకారం.. గరుగుబిల్లి మండలం చిలకాం గ్రామానికి చెందిన రేగిడి రాజు (43) తన అన్నయ్యను చూడడానికి ద్విచక్రవాహనంపై రామభద్రపురం మండలం ఆరికతోట వెళ్లి తిరిగి వస్తున్నాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన మృతి చెందారు. ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీకొందా? లేకుంటే బండిపై నుంచి పడి మరణించాడా? అన్న కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. రాజు భార్య కామేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొనడంతో ఒకరు చనిపోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన భోగాపురం సమీపంలోని కొత్త పెట్రోల్ బంక్ వద్ద బుధవారం సాయంత్రం జరిగింది. నందిగాం గ్రామానికి చెందిన గరే కనకరాజు, గూడెపువలస గ్రామానికి చెందిన సరగడ రామకాసు వీరిద్దరూ భోగాపురం నుంచి టోల్ గేట్ వైపు వెళ్తుండగా వీరిని వెనుక నుంచి కంటైనర్ లారీ ఢీకొనడంతో రహదారిపైకి తుళ్ళిపడ్డారు. లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో టోల్గేట్ వద్ద లారీని అడ్డుకున్నారు. గాయపడిన ఇద్దరినీ విజయనగరం ఆస్పత్రికి తరలించగా కనకరాజు(38) మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎల్విన్‌పేట పోలీసుస్టేషన్‌లో 2020లో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడికి పార్వతీపురం ఉమెన్ కోర్ట్ జడ్జి ఎన్.పద్మావతి పదేళ్ల జైలు శిక్ష, రూ.40 వేలు జరిమానా విధించారు. ఎస్‌పి మాధవ్ రెడ్డి కథనం ప్రకారం.. కొండుకుప్ప గ్రామానికి చెందిన యువతిని గ్రామానికి చెందిన ముద్దాయి పట్లాసింగి మధుసూదనరావు ప్రేమ పేరుతో నమ్మించి మోసగించాడు. దీంతో బాధితురాలు ఎల్విన్‌పేట పోలీసులకు ఫిర్యాదుచేసింది. అప్పటి సిఐ రమేష్ కుమార్ దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో పదేళ్ల జైలుశిక్షను జడ్జి విధించారు.

యాసిడ్ తాగి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని కారాడ గ్రామానికి చెందిన కూర్మదాసు రమణమ్మ (60) పొరపాటున ఇంట్లో టాయిలెట్ క్లీనింగ్ యాసిడ్ తాగి మృతి చెందింది. కుమారుడు ఇచ్చిన వివరాలు ప్రకారం.. తన తల్లికి చూపు మందగించిందని దీంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్రిడ్జ్ పక్కన ఉంచిన టాయిలెట్ క్లీనింగ్ యాసిడ్ ను పొరపాటున మంచినీళ్లు అనుకుని తాగేసిందని చెప్పారు. వెంటనే బొబ్బిలి హాస్పిటల్‌లో జాయిన్ చేసి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించామని అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందిందని తెలిపారు. ఎస్ఐ టి. శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభం పైనుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ బిడ్డిక ఆనంద్‌రావు బుధవారం విద్యుత్తు స్తంభంపై పనిచేస్తుండగా కాలుజారి కిందపడ్డాడు. ప్రమాదంలో ఆనంద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్పందించిన తోటి ఉద్యోగులు వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పర్యావరణాన్ని కాపాడండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వినాయక చవితిని పురస్కరించుకుని ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించుకోవడం శ్రేయస్కరమని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఓ ప్రకటనలో కోరారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాల ఆవశ్యకత ప్రజలందరూ గుర్తించాలన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర పదార్థాలతో తయారుచేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందని అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు ప్రసాదాల పంపిణీలో ప్లాస్టిక్ నిషేధాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.


డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన బుధవారం కోట వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ కోసం 2019లో ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేయడం ద్వారా నేడు కళాశాల మనకు వచ్చిందని అన్నారు. కళాశాల మంజూరై ఐదేళ్లు గడుస్తున్నా నేటికీ సొంత భవనం లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. డిగ్రీ కళాశాల భవనం ఏర్పాటు చేయాలని అధికారంలో ఉన్న టిడిపి నాయకులు అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమస్య తీర్చాల్సిన వారు ఇబ్బందులు ఉన్నాయని చెప్తుంటే ఇది విద్యార్థులను మభ్యపెట్టడమేనని అన్నారు. భవన నిర్మాణం పూర్తయ్యేంతవరకు తాత్కాలికంగా కోటలో డిగ్రీ కళాశాల విద్యార్థులకు తాత్కాలికంగా చదువు చెప్పేందుకు వీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిలిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, నగర అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, పి ,రమేష్, సహాయ కార్యదర్శి గుణేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కోట వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని కొత్తపేట వద్దగల కెఎన్‌బిఆర్ పాఠశాల విద్యార్థులు గురుబ్రహ్మ అక్షరాకృతిలో కూర్చొని అందరినీ ఆకర్షించారు. రంగు రంగుల టీ షర్టులు ధరించి ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాగభూషణరావు, ఉపాధ్యాయులు మక్కువ చంద్రకళాధర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– ప్రజాశక్తి, విజయనగరం

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజాన్ని తీర్చి దిద్దే ఉపాధ్యాయ వత్తి పవిత్రమైనదని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రా దేవి పేర్కొన్నారు. గురజాడ అప్పారావు స్వగృహంలో వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కుసుమంచి శ్రీదేవి, చల్లపల్లి శ్యామలను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుభద్రాదేవి మాట్లాడుతూ సమాజానికి అవసరమైన డాక్టర్, ఇంజనీర్, న్యాయవాది, రచయిత, ఇలా అందరినీ తయారు చేసేది ఉపాధ్యాయుడేనని పేర్కొన్నారు. అనంతరం సత్కార గ్రహీతలు ప్రసంగించారు. వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గురజాడ ఇందిర, సత్యలత, గీతారాణి, శ్రేయ, క్లబ్ సలహాదారు పప్పు విశ్వనాథం పాల్గొన్నారు.

జెఎన్‌టియులో సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ కాలేజీలో ఎన్ఐపి, ఎన్ఐఆర్ఎఫ్‌పై బుధవారం సెమినార్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా ప్రొఫెసర్ పాల్, ప్రొఫెసర్. రవిచందర్ హాజరయ్యారు. ముందుగా యూనివర్సిటీ లోని డైరెక్టర్లు, వివిధ విభాగాల అధిపతులతో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ కొత్త వెర్షన్, జాతీయ విద్యా విధానంపై చర్చించారు. నాక్‌లో ప్రస్తుతం అవలంభిస్తున్న, కొత్తగా అవలంబించబోయే విధానాలను వివరించారు. కళాశాలలోని వివిధ విభాగాలు, ల్యాబ్‌లను పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్. డి.రాజ్యలక్ష్మి , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, డైరెక్టర్లు, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. రాజేశ్వరరావు, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జె. నాగరాజు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల నమోదుకు 15 వరకు గడువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల నమోదుకు ఈనెల 15వరకు గడువు పెంచినట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ గోడ పత్రికను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ జిల్లాలో గల అన్ని యాజమాన్యాల పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలు మూడు , ఉన్నత పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులు చొప్పున ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ , పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమం లో విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు వెలికి తీయడం, సామాజిక సమస్యలకు పరిష్కారాలు సూచించడం, నూతన ఆలోచనలతో ప్రాజెక్టు రూపకల్పన చేయడంలో విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఎన్నిక కాబడిన ప్రతి ప్రాజెక్టుకు పదివేల రూపాయలు బహుమతిగా మంజూరు చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులంతా ఇన్‌స్పైర్ ప్రాజెక్టులను నమోదు చేయాలనీ కోరారు. నేటి వరకు జిల్లాలో గల 200 పాఠశాలల నుంచి 850 ప్రాజెక్టులు నమోదు చేశారని తెలిపారు. గడువు ఉన్నందున మరిన్ని ప్రాజెక్టులు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారం ఎం.కృష్ణారావు, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌టి నాయుడు, ఎఎస్ఒ శేఖర్, ఎడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి-రాజాం



మండలంలోని మొగిలవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మొయ్యి శ్రీరాములు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ 2010 నుంచి 2019 వరకు కేశపురం(విశాఖ జిల్లా) పాఠశాలలో పనిచేసినప్పుడు గ్రామ పెద్దలు, యువత సాయంతో ఆ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశానని తెలిపారు. దాతల సహాయ సహకారంతో సర్వతోముఖాభివృద్ధి చేయడం ద్వారా 2016లో జాతీయ స్వేచ్ఛ విద్యాలయ పురస్కారం అందుకున్నానని తెలిపారు. 2019లో మండల స్థాయి బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నానని చెప్పారు. తాజాగా ఈ ఏడాది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యానని తెలిపారు. గురుపూజోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటానని తెలిపారు. శ్రీరాములు ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు బి.రాజ్యలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా 75మంది ఎంపిక

నేడు కలెక్టరేట్‌లో అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఏటా అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాలో 75 మంది ఉపాధ్యాయులు ఎంపికైటనట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు.ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను టీచర్స్‌డే సందర్భంగా సత్కరించుకోవడం సాంప్రదాయకంగా వస్తోందని తెలిపారు. ఆయా సబ్జెక్టులు, కేటగిరిలను బట్టి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వారిలో 24మంది ఎస్‌జిటిలు, 8 మంది వ్యాయామ ఉపాధ్యాయులు, ఐదుగురు లెక్కలు ఉపాధ్యాయులు, 8 మంది బయాలజికల్ సైన్స్, హెచ్‌ఎంలు నలుగురు, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్‌ఎంలు ఐదుగురు, తెలుగు ఇద్దరు, ఫిజికల్ సైన్స్ ఆరుగురు, సోషల్, ఇంగ్లీషు ఆరుగురు చొప్పున, సిఆర్‌టి తెలుగు కెజిబివిని ఎంపిక చేసినట్లు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో వారికి అవార్డులు అందజేస్తామని తెలిపారు.

సాంకేతికపరంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-గజపతినగరం



మారుతున్న ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ వైపు విద్యార్థులు పరుగులు తీస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు కూడా సాంకేతిక పరంగా అభివృద్ధి చెందాలని జిన్నాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.త్రినాధ రావు అన్నారు. కార్యాచరణ ఆధారంగా విద్యను ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో బోధించడం ద్వారా వారిని ఆకట్టుకోవడంతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన వెనుకబడిన విద్యార్థులలో విద్య నైపుణ్యాలను పెంపొందించడానికి సహాయపడుతుందని అన్నారు. దీనిలో భాగంగానే ప్రస్తుతం ఉన్న బోధన ఉపకరణ సామాగ్రిని (టిఎల్‌ఎం) ఉపయోగించి విద్య నైపుణ్యాలను వారిలో పెంచాలని అన్నారు. గణితం పట్ల ఆసక్తి కలగాలని, వెయ్యికి పైగా గణిత వీడియోలు తయారు చేసి యూట్యూబ్ లో పెట్టడం ద్వారా విద్యార్థులకు గణితం పట్ల మరింత విశ్వాసం కలిగేలా చేశామని తెలిపారు. ఈ విధంగా విద్యను విద్యార్థులకు బోధించడం వలన గత పదో తరగతి పరీక్షల్లో 97శాతం ఉత్తీర్ణత రాగా ట్రిబుల్ ఐటికి ఏడుగురు, ఎన్.ఎం.ఎం.ఎస్ (నేషనల్ మెరిట్స్) స్కాలర్‌షిప్‌కు 11 మంది తమ పాఠశాల విద్యార్థులు అర్హత పొందారని తెలిపారు. విద్యార్థుల ఏకాగ్రత, ఆలోచన శక్తి పెరగాలంటే విద్యలో భాగంగానే ఆటలకు కూడా తగిన ప్రాముఖ్యత ఇవ్వాలని, తద్వారా శారీరక ధృఢత్వం, మానసిక వికాసం కలుగుతాయని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాజశేఖరరావు

ప్రజాశక్తి-రామభద్రపురం



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏటా ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రామభద్రపురం జెడ్‌పి హైస్కూలు సోషల్ ఉపాధ్యాయుడు చిప్పాడ రాజశేఖరరావు ఎంపికయ్యారు. ఈయన ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం నుంచి రాష్ట్ర శాంఘిక శాస్త్రఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా, బొబ్బిలి డివిజన్ అధ్యక్షులుగా, 2024 ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబెర్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ 2024 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసి సత్కరించింది. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా, డిఆర్‌పిగా పనిచేస్తూ అనేక శిక్షణా కార్యక్రమాల్లో కొంతకాలంగా పాల్గొంటున్నారు. ఆయన అందించిన సేవలు, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో చేసిన కృషికిగాను ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది.

గురువు స్థానం ప్రత్యేకమైనది

కోరాడపేట ఎంపిపి స్కూలు హెచ్‌ఎం పైడితల్లి

ప్రజాశక్తి-విజయనగరం



విద్యార్థి జీవితంలో గురువు స్థానం ప్రత్యేకమైనదని విజయనగరం మండలంలోని కోరాడపేట ఎంపిపి స్కూలు ప్రధానోపాధ్యాయులు చుక్కల పైడితల్లి అన్నారు. టీచర్స్‌డే సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విద్యార్థులకు తల్లిదండ్రుల తరువాత ఎక్కువగా చూసేది గురువేనని అన్నారు. అలాంటి టీచర్ ఒక మంచి ఉపాధ్యాయుడుగా మారడానికి పలు లక్షణాలు దోహదం చేస్తాయన్నారు. మంచి ఉపాధ్యాయుడిని తయారు చేసే జాబితాలో అగ్రస్థానంలో కమ్యూనికేషన్ స్కిల్ ఉంటుందన్నారు. విద్యార్థి, టీచర్ మధ్య కమ్యూనికేషన్ ఎంత బాగా ఉంటే వారి బంధం అంత బాగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులకు లజనింగ్ స్కిల్స్ కూడా అవసరమన్నారు. ఉపాధ్యాయులను అర్థం చేసుకునేందుకు, మంచి ఉపాధ్యాయుడిగా ఉండేందుకు లిజనింగ్ స్కిల్స్ కీలమన్నారు. స్నేహ పూర్వక వైఖరి కలిగి ఉండడం మంచి గురువు అత్యంత ముఖ్యమైన లక్ష్యణమన్నారు. బోధనా ప్రపంచంలో సహనం అనేది ఉపాధ్యాయుడికి అవసరమన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా మంచి నిర్వాహకులుగా ఉండాలని, వ్యవస్థీకృతం కావడం మంచి ఉపాధ్యాయుడిగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులతో స్నేహ పూర్వక వాతావరణం కూడా ఉండాలని చెప్పారు. విద్యార్థుల పట్ల గౌరవ ప్రదమైన వైఖరి కూడా ఉపాధ్యాయుల ప్రతిష్టను పెంచుతుందని అన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

గోచక్క పంచాయతీ, బొడ్డవలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈదుబిల్లి నీలకంఠస్వామి(49) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. వెంకంపేట పంచాయతీ శివారు కాలనీలో నివసిస్తున్న ఆయన తెల్లవారు జామున ఛాతిలో నొప్పి రావడంతో అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రికి తరలించేలోగా మార్గం మధ్యలోనే మరణించినట్లు స్థానికులు తెలియజేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నీలకంఠ స్వామి మృతి పట్ల యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, మురళీమోహనరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బంటు జగన్నాథం, వంగపండు వసంత నాయుడు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

డిఇఐసి సందర్శన

పార్వతీపురం :జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని(డిఇఐసి) డిప్యూటీ డిఎంహెచ్ఓ టి. జగన్మోహనరావు, ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయ అధికారి పిఎల్. రఘుకుమార్ బుధవారం సందర్శించారు. ప్రతి నెలా డిఇఐసి కేంద్రంలో పలు ఆరోగ్య సమస్యలైన పుట్టుక, ఎదుగుదల లోపాలు, వ్యాధులు, వైకల్యంతో నమోదు అవుతున్న పిల్లల వివరాలు అందజేస్తున్న వైద్య సేవలు, ఏ మేరకు ఆరోగ్య సమస్యల పరిష్కారం చేశారు, వాటి పర్యవేక్షణ తదితర వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయా లోపాలు, వైకల్యాల సవరణకు అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, సామగ్రిని వినియోగిస్తున్న తీరుపై సిబ్బందిని అడిగారు.

విద్యార్థికి అభినందన

సీతానగరం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన అప్పయ్యపేటకు చెందిన పువ్వల రుష్యేంద్ర ఐఎటి -2024లో జాతీయ స్థాయి సత్తాచాటి, పూణెలోని ఐఇఎస్ఆర్‌లో ఐదేళ్ల డ్యూయల్ కోర్స్‌కు ఎంపికయ్యాడు. దీంతో ఆ విద్యార్థిని ఎస్ఎంసి చైర్‌పర్సన్ పలగర శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

తెగుళ్ల పట్ల జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం : రైతులు వరిచేలో వస్తున్న తెగుళ్ల పట్ల జాగ్రత్తలు వహించాలని ఎఒ అవినాష్ సూచించారు. మండలంలోని బుడ్డిపేటలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు బట్టి తెగుళ్లు వస్తున్నాయన్నారు. అగ్గి, గోధుమ రంగు ఆకు ముదురు, పాము తెగుళ్లు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

పార్వతీపురం రూరల్ : పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేయాలని ఎంపిడిఒ అఖిబ్ జావెద్ అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు పనులు చేపట్టాలన్నారు. దోమలు విజృంభించకుండా ఫాగింగ్ నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమణమూర్తి, డిఎల్‌పిఒ నాగభూషణ్ పాల్గొన్నారు.

కె.వెంకటాపురంలో ఆయుర్వేద వైద్య శిబిరం

సీతానగరం : మండలంలోని కె.వెంకటాపురంలో బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి టి.హేమాక్షి ఆధ్వర్యాన బుధవారం ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 60 మంది ఈ శిబిరాన్ని వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది పద్మ , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

పాలకొండ : జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కోట దుర్గమ్మ ఆలయ కళ్యాణ మండపంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐదో వార్డు కౌన్సిలర్ వెలమల మన్మథరావు, వైస్ ఎంపిపి కనపాక సూర్య ప్రకాష్, లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర, కడగల రమణ, దుప్పాడ పాపి నాయుడు, తుమ్మగుంట శంకరరావు, నీలాపు శ్రీను, భాసూరు కాంతారావు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.4,39,523

పాలకొండ : పట్టణంలో కోటదుర్గమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఆగస్టు మూడో తేది నుంచి బుధవారం వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా 4,39,523 రూపాయలు వచ్చింది. కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ జిల్లా కార్యాలయ జూనియర్ సహాయకులు పర్యవేక్షించారు. ఆలయ ఇఒ మురళీకృష్ణ, తదితరులు ఉన్నారు.

జిల్లాలో రక్తహీనత నివారణకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

జిల్లాలో రక్తహీనతను నియంత్రించేందుకు అన్ని వర్గాలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. వీరఘట్టం మండలంలో బుధవారం కలెక్టర్ పర్యటించారు. హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన మన బడి-మన తోట కార్యక్రమం, సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి విత్తనాలు నాటే కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయం నేర్చుకునేలా పిల్లలను ప్రోత్సహించారు. పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను పెంపొందించేందుకు ముఖ్యంగా తోటల ద్వారా పొందే పౌష్టికాహార విలువలు పిల్లలకు తెలిసే విధంగా మన బడి మన తోట కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం సంపూర్ణ పోషణ అభియాన్ స్టాల్స్‌ను పరిశీలించారు. స్టాల్స్‌లో పోషక విలువలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రక్తహీనత నియంత్రణకు ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. రక్తహీనత ఉన్న సిబ్బందిని గుర్తించి, సమస్యను పరిష్కరించడానికి శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణుల నమోదులో జాప్యం చేయరాదని, తద్వారా సమస్యను సులభంగా పరిష్కరించవచ్చని తెలిపారు.గ్రామాల్లో సిహెచ్‌డబ్ల్యులు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు గర్భిణులను గుర్తించడంతోపాటు సంపూర్ణ పోషణ కింద



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆరోగ్య పరిస్థితి బాగుండాలంటే పౌష్టికాహారం తీసుకునేలా కుటుంబ సభ్యుల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. 'ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సాధికారత కలిగిన సంఘం కోసం ప్రతిజ్ఞ - ఆకాంక్ష నుండి స్ఫూర్తిదాయకం వరకు' అంటూ ఏర్పాటు చేసిన బోర్డుపై కలెక్టరు సంతకం చేశారు.

వర్మీ కంపోస్ట్ యూనిట్ పరిశీలన

వీరఘట్టంలోని వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. సిబ్బంది కృషిని అభినందించి మోడల్ యూనిట్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా షెడ్డు మిత్ర యాళ్ల ప్రసాదరావును కలెక్టర్ సత్కరించారు. జిల్లాలో 138 యూనిట్లు ఉన్నాయని, అక్టోబరు రెండో తేది నాటికి వాటన్నింటిని కార్యాచరణలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

మహిళా మార్ట్ సందర్శన

వీరఘట్టం మండల సమాఖ్య స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌ను కలెక్టర్ సందర్శించారు. అక్కడ విక్రయిస్తున్న వస్తువులను పరిశీలించి సభ్యులతో ముఖాముఖి మాట్లాడారు. విక్రయాలు, ఇతర మౌలిక వసతులపై ఆరాతీశారు. రోజురోజుకు మరింత అనుభవాన్ని పొందాలని తద్వారా అమ్మకాలను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమం లో డిఇఒ గార పగడాలమ్మ, ఇన్‌ఛార్జి డిపిఒ కె.రామచంద్రరావు, డిఆర్‌డిఎ పీడీ వై.సత్యం నాయుడు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి ఎంఎన్‌రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుబజార్ ఏర్పాటు చేయాలని వినతి

వీరఘట్టంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, పప్పల మహేష్.. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు బజార్ లేకపోవడంతో కూరగాయల రైతులు దళారులను ఆశ్రయించి, తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. వీరఘట్టంలో 30 పడకల ఆసుపత్రి, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

ఆశ్రమ పాఠశాలలో పిఒ తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ రమణ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ పిఒ వి.వి.రమణ బుధవారం తనిఖీ చేశారు. తరగతి గదులను, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉండాలని ఆదేశించారు. భోజనశాల శుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు వండిన భోజనంలో నాణ్యత లోపించడం, పప్పు, పెరుగు పలుచగా ఉండడం, విద్యార్థులకు సరిపడా భోజనం వండకపోవడం వంటివి గమనించి, సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, హెచ్ఎం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ నర్సరీ పరిశీలన

తురాయపువలసలోని నర్సరీని ఐటిడిఎ పిఒ వి.వి.రమణ పరిశీలించారు. ఎకో టూరిజం ఏర్పాటు నిమిత్తం నర్సరీని సందర్శించారు. ఎకో టూరిజం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, పిహెచ్ఒ ఎస్.వి.గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఐటిడిఎ ఆర్థికసాయం

కొత్తూరు మండలం అడ్డంగి పంచాయతీ బొండూరు గ్రామానికి చెందిన సవర నిఖిల్ అనే బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం ఐటిడిఎ పిఒ వి.వి.రమణ 13 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఆ బాలుడు కాళ్లు వంకర వ్యాధితో బాధపడుతున్నాడు. కార్యక్రమంలో మెడికల్ సెక్షన్ అసిస్టెంట్ మనోజ్ పాల్గొన్నారు.



నగేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నగేష్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన పంచాయతీరాజ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ మత్తి నగేష్ చిన్న కుమారుడు మానవ్ మృతిచెందడంతో బుధవారం ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే జగదీశ్వరి పరామర్శించారు. చిన్నతనంలోనే మానవ్ మృతి చెందడం పట్ల ఆమె విచారం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, నాయకులు రామారావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని కోటిపాం గ్రామంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ సుంకరి సుగుణ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన శిబిరంలో నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండపల్లివలసకు సిసి రోడ్డు వేయాలి

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని శంబర పరిధిలో ఉన్న కొండపల్లివలసకు సిసి రోడ్డు నిర్మించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం కొండపల్లి వలసను ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆదినారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపల్లివలసలో 40 గిరిజన కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. గిరిజన గ్రామాలపై వివక్ష చూపడం తగదన్నారు.

9న పార్వతీపురంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 9న పార్వతీపురం ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాబ్ మేళాకు కెవెల్ గ్రూప్ - అమెజాన్ సంస్థ హాజరవుతుందని చెప్పారు. రెండు వందల ఉద్యోగాలను సంస్థ నియామకం చేయనుందని వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఇంగ్లీష్ చదవడంలో పరిజ్ఞానం ఉండాలని, అభ్యర్థుల వయస్సు 30 సంవత్సరాల లోపు ఉండాలని, వేతనం 16 వేల నుండి 18 వేల రూపాయల వరకు ఉంటుందని చెప్పారు. చెన్నై కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగంలో భాగంగా సేకరించడం (పికింగ్), ప్యాకింగ్, అన్ లోడింగ్ కార్యక్రమాలను చేయాల్సి ఉంటుందని చెప్పారు. జాబ్‌మేళా వివరాలకు రాము (8978878557), అశోక్ (9494777553) లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలపై అవగాహన

భామిని : రోజువారి ఆహారంలో చిరుధాన్యాలు కూడిన ఆహార పదార్థాలు భాగం కావాలని సిడిపిఒ శాంతిభవాని అన్నారు. బుధవారం మండలంలోని బిల్లుమడ, భామిని పంచాయతీలోని అంగన్వాడీ కార్యాలయాలలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. చిరుధాన్యాలతో చేసిన పోషక పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బిపిసి వరలక్ష్మి, సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, ఆస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ మహేష్, అంగన్వాడీ సహాయకులు సభిత, పంచాయతీ కార్యదర్శి విశ్వేశ్వరరావు ఉన్నారు.

మా గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దు

ప్రజాశక్తి-పాలకొండ

డంపింగ్ యార్డు తమ గ్రామంలో ఏర్పాటు చేయొద్దని సింగన్నవలస సర్పంచ్ చేబోదుల లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ కాయల దామోదర్ రావు, ఎస్ఎంసి అధ్యక్షులు రమేష్, జనసేన నాయకులు దిలీప్ కుమార్, మన్మథ రావు, రామారావు, తదితరులు బుధవారం డిటి సన్యాసి రావును కలిసి వినతిపత్రం అందించారు. పాలకొండ డంపింగ్ యార్డు తమ గ్రామ పరిధిలో ఏర్పాటు చేస్తే గ్రామస్తులకు ఇబ్బందులు ఎదురవుతాయని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని వివరించారు.

వికలాంగులకు సేవ చేయడం అవసరం

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి - కొత్తవలస

సమాజంలో వికలాంగులకు సేవ చేయడం ఎంతో అవసరమని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం శ్రీ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్‌పి, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ వికలాంగుల పట్ల ఇంతటి ప్రేమానురాగాలు నిస్వార్ధంగా సేవలందించిన జగదీష్ బాబు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మంగళ పాలెంలో ఇటువంటి కార్యక్రమాలు జరగడం దేశానికి ఆదర్శమన్నారు. గత 26 సంవత్సరాలుగా వికలాంగు లకు చేస్తున్న సేవలను, పేద ప్రజలకు కనీస వైద్య సహాయం అందించాలనే దృక్పథంతో ఆసుపత్రి నిర్మించి సేవలందించడం గొప్ప విషయమని అన్నారు. వికలాంగులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ట్రస్ట్‌కు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు.


కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే

అనంతరం వికలాంగులకు కాళ్లు, చేతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస, ఎస్‌కోట టిడిపి మండల అధ్యక్షులు గొర్లపల్లి రాము, జీఎస్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, నాయకులు కోరుబిల్లి ఉపేంద్ర, నక్కరాజు, చిన్న రాము, లెంక శ్రీను, విగ్రోతు శివాజీ, బాలకృష్ణ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ట్రాఫిక్

తీవ్ర ఇబ్బందులు పడిన ప్రయాణికులు

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలోని గంగరేగువలస నుంచి కూనేరు వరకు అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారింది. దీంతో రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ బుధవారం ఉదయం గుమడ గ్రామం వద్ద గోతిలో దిగబడింది. లారీ రోడ్డుకు అడ్డుగా ఉండిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అటు కూనేరు వైపు, ఇటు పార్వతీపురం వైపు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఆటోలు, ఆర్‌టిసి బస్సులు సైతం రాకపోకలకు అంతరాయం కలగడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనులపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్కడో ట్రాఫిక్ ఆగినచోట దిగి, అక్కడ నుంచి నడుచుకొని ఉద్యోగులు, విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. లారీ డ్రైవర్లు స్థానికుల సహాయంతో లారీని మధ్యాహ్నానికి బయటకు తీశారు. స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగా రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను కప్పాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.


తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న రైతు బాలాజీ

కెరటాం విఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొండపల్లి

భూ రీ-సర్వేలో తమ సాగు హక్కులో ఉన్న భూములను తమ పేరు మీద కాకుండా 1బి, అడంగల్ వేరొకరి పేరున మార్చిన కెరటాం విఆర్‌ఒ ఎన్.దివ్య ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని నెలివాడ గ్రామానికి చెందిన బడిబట్ల బాలాజీ తహశీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కెరటాం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెం 79-5లో ఎనిమిది ఎకరాల మెట్ట భూమి తమ తండ్రి బడిబట్ల లక్ష్మునాయుడు పేరున ఉందని, అయితే తన తండ్రి పేరున ఉన్న భూమిని పది సంవంత్సరాల క్రితం మరణించిన బడిబట్ల అప్పల సన్యాసమ్మ పేరున రీ-సర్వేలో విఆర్‌ఒ మార్పు చేశారని ఆరోపించారు. తన తండ్రి పేరున ఉన్న భూమిని వారసత్వంగా తనకు దఖలు పడేందుకు మ్యుటేషన్ పెట్టినప్పటికీ విఆర్‌ఒ తిరస్కరించే వారని ఆయన తహశీల్దార్‌కు వివరించారు. విఆర్‌ఒ వేరొకరి దగ్గర సొమ్ము తీసుకొని తమ రికార్డులు మార్చారని, ఆయనపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాలాజీ కోరారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-సీతానగరం

ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించు కోవాలని పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తేరీజమ్మ కోరారు. పెద్దభోగిలి పంచాయతీ పరిధిలోని బుడ్డిపేట అప్పయ్యపేట, పెదబోగిలిలో ఉన్న ఎనిమిది కేంద్రాలకు సంబంధించి కార్యకర్తల ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కీర్తిశేషులు దాస్ మాస్టారు భార్య భాగ్యవతమ్మ అంగన్వాడీ కేంద్ర పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. అంగన్వాడీ సూపర్వైజర్ పూర్ణిమ, ఎంపిటిసి సొరగాల గౌరీ, ఎఎన్ఎం కుమారి, ఎంఎల్‌హెచ్ఒ భాగ్య, అంగన్వాడీలు రామలక్ష్మి, శ్రీదేవి, సునీత, లక్ష్మి, పాల్గొన్నారు.

కొమరాడ : గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని వినియోగించుకోవాలని ఐసిడిఎస్ పిఒ సుగుణ అన్నారు. బుధవారం


సీతానగరం: పలకలు పంపిణీ చేస్తున్న భాగ్యవతమ్మ

కుమ్మరిగుంట అంగన్వాడీ కేంద్రం వద్ద పౌష్టిక ఆహార వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేసి, పోషకాహార వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు శారదాంబ, అరుణ, సర్పంచ్ జి.లక్ష్మణరావు, టిడిపి నాయకులు ఎన్.మధుసూదన్‌రావు, అంగన్వాడీ అలివేలు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ , పీజీ కళాశాల లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి షేక్ నూరున్నిష గత నెల 31న జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, చిత్తూరు జిల్లాలో జరిగిన ఖేలో ఇండియా రాష్ట్ర ఉమెన్ చాంపియన్‌షిప్‌లోను, సీనియర్ రాష్ట్ర తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లోను 57 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. ఈ పోటీలు తమిళనాడులో ఈనెల 11 నుంచి 14 వరకు, సీనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు పాండిచ్చేరిలో అక్టోబర్ 17 నుంచి 20 వరకు జరుగుతాయి. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎస్. పల్లవి అనకాపల్లిలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలో 71కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. ఇదే పోటీలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎ.యశస్వి 64కేజీల విభాగంలో రెండు రజిత పతకాలు, బి.నీరజ 45 కేజీల విభాగంలో ఒక స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణరావు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్య వేణి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపునాయుడు, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము పాల్గొన్నారు.

పిఎంపి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇటీవల మృతి చెందిన పిఎంపి ఎస్‌బి రాజు కుటుంబానికి జిల్లాలోని ప్రైవేటు మెడికల్ ప్రాక్టీసనర్స్ (పిఎంపి) అసోసియేషన్ అధ్యక్షులు పేరి రామయ్య పంతులు, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ పట్నాయక్, రెడ్డి గోవిందరావు, రాముడు ఈశ్వరరావు, అప్పలరాజు తదితరులు ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ సభ్యుల ద్వారా వసూలు చేసిన రూ.85వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం పూల్‌బాగ్ మంగళవీధిలో నివాసముంటున్న రాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. పిల్లల చదువు నిమిత్తం, ఇంకా ఏవైనా ఆర్థిక అవసరాలు ఉంటే పిఎంపి సంఘ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు.

డీలర్‌ను నియమించాలని నిరసన

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలో పెద్దవలస జిసిసి డిపోలో పూర్తి స్థాయిలో డీలర్‌ను నియమించాలని తహశీల్దారు కార్యాలయం వద్ద బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గిరిజన సంఘం మండల అధ్యక్షులు వంతల సుందర్రావు మాట్లాడుతూ డిపో పరిధిలో ఉన్న గ్రామాల గిరిజనుల నుంచి డీలర్‌ను ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కూనేటి చినబాబు, పొట్టంగి రాము, బోయిన లక్ష్మణరావు, గేమ్మెల వంశి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి తాడంగి గాసి, సిఐటియు జిల్లా నాయకులు ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డిఎస్‌సి ఉచిత కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతకు త్వరలో ఉచిత డిఎస్‌సి కోచింగ్ ప్రారంభించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎం.రుక్మాంగదయ్య చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురంలో డిఎస్‌సి కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బిఇడి, టిటిసి పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణులైన గిరిజన అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందజేయనున్నట్లు తెలిపారు. ఒక్కో సెంటర్‌లో వంద మంది అభ్యర్థులకు మూడు నెలల పాటు ఉచిత కోచింగ్ ఇస్తామని చెప్పారు. పార్వతీపురం సెంటర్‌లో గిరిజనేతరులు కొంతమందికి అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కోచింగ్‌తోపాటు ఉచిత స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు. ఈమేరకు డిడి కార్యాలయానికి 220 మంది, డిఇఒ కార్యాలయానికి వందమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

మంత్రి నియోజకవర్గంలో లేదా?

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో ఉచిత డిఎస్‌సి కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడంపై నిరుద్యోగ యువత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గుమ్మలక్ష్మీపురంలో కోచింగ్ సెంటర్ చేస్తున్న ఐటిడిఎ అధికారులు సాలూరులో ఏర్పాటు చేయకపోవడాన్ని తప్పుపడుతున్నారు. ఈ నియోజకవర్గంలోనూ అధిక సంఖ్యలో డిఎస్‌సికి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల్లో ఎస్‌టి నిరుద్యోగ యువత ఉన్నారు. వీరి కోసం సాలూరు వైటిసిలో ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహించాలని వారు కోరుతున్నారు.

'సీతం'లో ఎన్‌సిసి బాలికల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

2ఎగర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి బాలికల ఎంపిక బుధవారం జరిగింది. ఎంపికలో భాగంగా 500 మీటర్ల రన్నింగ్, కళ్ల నిర్ధారణ పరీక్ష, చేతులు, కాళ్ల కదలికల పరీక్ష, బాడీ మాస్ ఇండెక్స్, రాత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఆధారంగా ఎంపిక చేపట్టారు. ఇంజినీరింగ్ కళాశాల నుంచి 150 మంది, సత్య అండ్ పిజి కళాశాల నుంచి 100 మంది బాలికలు పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి,డాక్టర్ సాయిదేవమని, కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, ప్రశాంత్, సిఎస్ఒ సత్యనారాయణ, పీడీ మహేశ్వరరావు పాల్గొన్నారు.

స్థలాలు వచ్చే వరకూ అక్కడే ఉండండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

'మీకు శాస్వతంగా ఉండేలా ఇండ్ల స్థలాలు ఏర్పాటు చేసేంత వరకూ మీరు ఉంటున్న స్థలాల్లోనే ఉండండని ఈ విషయంపై హైవే అధికార్లతో మాట్లాడుతానని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. పూసపాటిరేగలో హైవేను ఆనుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్న ముస్లింలకు ఇళ్లు ఖాళీ చేయాలని హైవే అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో వారంతా స్థానిక నాయకుడు మహంతి శివను ఆశ్రయించారు. శివ ముస్లింలను తీసుకొని బుధవారం ఎమ్మెల్యే నాగమాధవి వద్దకు వెళ్లి విషయం తెలిపారు. వెంటనే ఆమె హైవే అధికార్లతో మాట్లాడుతానని, మీకు జనవరిలో


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం మాధవి

శాశ్వత ఇండ్ల స్థలాలు, గృహలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకూ అక్కడే ఉండేలా హైవే అధికార్లుకు చెప్పానన్నారు. దీంతో వారంతా వెనుదిరిగారు. వారితోపాటు జనసేన నేత మహంతి శివ, కిలారి సూరిబాబు తదితరులు ఉన్నారు.

చేయి చేయి కలిపి.. కాలువ శుభ్రం చేసి

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని వెంగళరాయసాగర్ కుడి ప్రధాన కాలువ పరిధిలోని పూడికతో నిండిన 15ఎల్ కాలువను రైతులంతా చేయి చేయి కలిపి శుభ్రం చేశారు. బుధవారం మండలంలో కన్నంపేట నుండి కొండ బేజారు, సీతానగరం మండలంలోని బొక్కుపేట, బల్లకృష్ణాపురం వరకు సుమారు 70 మంది రైతులు పాల్గొని సాగునీటి కాలువను శుభ్రం చేశారు. దీంతో ఆయా గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా ఉంటుందని వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని, అందుకే తామంతా శ్రమించాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు.

మా భూమిని అప్పగించండి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-జామి

వారసత్వంగా తమకు వచ్చిన భూమిని అప్పగించాలంటూ, బాధిత కుటుంబం తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేసింది. మండలంలోని గొదుకొమ్ము రెవెన్యూలో సర్వేనెం 49, 52లలో తన కుటుంబానికి సంభందించి కొంత భూమి వుందని వారసత్వంగా అందులో కొంత భూమి తనకు వచ్చిందని నమ్మి అన్నపూర్ణ తెలిపారు. ఆ భూమిని కొంత మంది కబ్జా చేస్తున్నారని తన భూమిని తనకు అప్పగించాలని కూతురు, అల్లుడుతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ భూముల పక్కనే తమ కుటుంబానికి చెందిన ఇతర వాటాదారుల వద్ద కొనుగోలు చేసిన ఓ స్థానిక వ్యక్తి తన భూమిని సైతం ఆక్రమించి సాగు చేస్తున్నాడని ఆరోపించారు. విశాఖలో స్థిరనివాసం ఉంటున్న తన కుటుంబ సభ్యులు అనేక ఏళ్ళగా భూపోరాటం చేస్తున్నారని అన్నపూర్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డిఒ కోర్టులోనూ, జాయింట్ కలెక్టర్ కోర్టులోనూ తమకు అనుకూలంగా తీర్పులు వచ్చాయని కానీ భూమి మీదకు వస్తే సదరు ఆక్రమణ దారుదు దాడులు చేస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా ఉపయోగం లేకపోవడంతో కార్యాలయం ఎదుట బైఠాయించామని చెప్పారు. ఇప్పటికైనా తన భూమిని తనకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులతో తహశీల్దార్ కృష్ణలత, జామి ఎస్ఐ వీరబాబులు మాట్లాడి భూమిని శుక్రవారం రెవెన్యూ, పోలీసుల సమక్షంలో అవ్వగిస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధిత కుటుంబం ఆందోళనను విరమించారు.

యువత మత్తుకు బానిస కావద్దు

ప్రజాశక్తి- బొండపల్లి

దేశానికి ఆయువు పట్టు యువతేనని అలాంటి యువత మత్తుకు బానిస కావద్దని గజపతినగరం సిఐ జివివి రమణ కోరారు. మంగళవారం రాత్రి మండలంలో గొట్లాం గ్రామంలో బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ గ్రామాలలో కొంత మంది తమ స్వలాభం కోసం మత్తు పదార్థాలు విక్రయించి యువత జీవితాలతో ఆడుకుంటున్నారని అలాంటి వారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ అవగాహనా కార్యక్రమంలో ఎఎస్ఐ లెంక గోపీనాధం, నాయకులు కోరాడ కృష్ణ, సిడగం శ్రీనివాసరావు, తాళ్ళపూడి రమణ, పి.వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.